క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు : విద్యా సంవత్సరం (2025-26)కు 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు మార్చి6వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రసూన పేర్కొన్నారు. అయి దో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ఎస్సీలు 2012 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వెర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సి) విద్యార్థినులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన వా రు అర్హులని తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్ర వేశాలకు 2024-25 విద్యాసంవత్సరంలో ప దో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అ ర్హులని చెప్పారు. అయిదు, ఇంటర్ ప్రవేశాల కు దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థినుల తల్లిదండ్రుల ఏడాది ఆదాయం రూ. లక్ష మించకూడదని తెలిపారు. అయిదో తరగతికి http://apbrafcet.apcfrr.in ఇంటర్‌కు http://apbrafcet.apcfrr.in/inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం 37 మంది గర్భిణులకు వైద్యపరీక్షలను వైద్యాధికారి దివాకర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి ప్రసవం వారందరూ ప్రధాన మంత్రి మాతృత్వ వందన అభియాన్ యోజన పథకం దరఖాస్తు కోసం వారి బ్యాంకు అకౌంట్, ఆధార్ , మొబైల్ నంబర్లను అందజేయాలని కోరారు. ఉచితంగా కాల్షియం, ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు, పాలు, గుడ్లు, వంటి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.

పన్ను వసూళ్లు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

సత్యవేడు : మండలంలోని 28 పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు వందశాతం మార్చి 31 లోపు పూర్తి చేయాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. పీఆర్ యాప్‌లో గ్రామీణ పారిశుద్ధ్యం వివరాలు, చెత్త సేకరణ, తాగు నీరు, విద్యుత్ దీపాల నిర్వహణ వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. మండలంలో చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ మెరుగు పడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ , ఈఓపీఆర్డీ తరునాక్షరెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రతిభ


హనీషాను అభినందిస్తున్న గుడ్లూరు ఐశ్వర్య

శ్రీకాళహస్తి : విజయవాడలో స్టేట్ లెవల్ అబాకస్ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం రెండో తరగతి విద్యార్థిని కె.హనీషా మొదటి ర్యాంక్ సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. హనీషా జూనియర్స్ లెవల్-1లో సత్తా చాటి సర్టిఫికెట్, కప్ అందుకున్నారు. మంగళవారం ఆ విద్యార్థినిని పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య అభినందించారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం.. రేణిగుంట మండలం, చెంగారెడ్డిపల్లె దళితవాడకు చెందిన ఈశ్వరయ్య, సుజాత భార్యాభర్తలు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. మూడు నెలలు క్రితం ఇంటి మిద్దె పైన నిద్రిస్తున్న భర్త ఈశ్వరయ్యను హత్య చేసిన కేసులో భార్య సుజాతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సుజాతను కన్న బిడ్డలు, బంధువులు చేరదీయలేదు. దీంతో ఆమె మండలంలోని కొత్రమంగళం దళితవాడలోని అమ్మగారింటికి వెళ్లింది. బంధువులు మాట్లాడలేదన్న మనోవేదనతో సోమవారం రాత్రి కొత్రమంగళం పంచాయతీ కార్యాలయంలో ఉరి వేసుకొని తనువు చాలించింది. గాజులమండ్యం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం మృతుదేహాన్ని కుటుంబీకులకు అప్పజెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇదిలా వుండగా సుజాత మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఆమె ఎందుకు ఉంది, కార్యాలయంలో ఎందుకు ఉరివేసుకుంది అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది.

రేణిగుంట జీపాళెం వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డగించిన మహిళలు


మహిళల అడ్డగింతతో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు


కూటమి చేతుల్లో.. స్వర్ణమ్మ విలవిల

- పట్టపగలే రేణిగుంటలో జేసీబీలతో ఇసుక తవ్వకాలు
- ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న మహిళలు
- చోద్యం చూస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : కూటమి నేతల చేతుల్లో ఏడు నెలలుగా స్వర్ణముఖి నది విలవిల్లాడుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీలతో ఇసుకాసురులు అక్రమంగా తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులు అటువైపు వెళ్లేందుకు సాహసం చేయడం లేదు. శ్రీకాళహస్తి నాయకుడి పేరుతో కొందరు వ్యక్తులు అక్రమ తవ్వకాలకు పహారా కాస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పేట్రేగిపోతున్న ఇసుకాసురుల చేష్టలు విసిగిపోయిన మహిళలు కలిసికట్టుగా మంగళవారం అడ్డుకున్నారు.

రేణిగుంట మండలం జీపాలెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా సాగిస్తున్న ఇసుక అక్రమ రవాణాను మంగళవారం స్థానిక మహిళలు అడ్డుకున్నారు. ట్రాక్టర్లను రోడ్డుపైన ఆపేయడంతో ఇసుక లోడ్ ఉన్న ట్రాక్టర్లు స్వర్ణముఖి నదిలో వరుసగా నిలిచిపోయాయి. మహిళలు ట్రాక్టర్లను అడ్డగించి నిరసన తెలిపినా కూడా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు అటువైపు రాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారులకు తెలిసే ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది అనేందుకు ఇదో ఉదాహరణ అని స్థానికులు చెబుతున్నారు. ఫోన్ చేసి చెబుదామన్నా సంబంధిత అధికారులు ఎవరూ ఫోన్లు ఎత్తడం లేదని తమ గోడు ఇంకెవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.


పిల్లపాళెం సమీపంలో జేసీబీతో ఇసుక అక్రమ తవ్వకాలు

అధికారుల మొక్కుబడి చర్యలు

ఇసుక అక్రమ రవాణా పై అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. పోలీసులు యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపితేనే మాకు సంబంధం అంటుంటే, రెవెన్యూ అధికారులు ఇసుకకు మాకు అసలు సంబంధమే లేదనేలా వ్యవహరిస్తున్నారు. మైనింగ్ అధికారులు జాడ మండలంలో అసలు కనిపించదు. నామ మాత్రంగా అప్పుడప్పుడూ జేసీబీలు, టిప్పర్లను స్వాధీనం చేసుకుంటున్నారే తప్ప కఠిన చర్యలు మాత్రం తీసుకునేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇదే అదునుగా చేసుకొని రాత్రి, పగలు అనే తేడా లేకుండా రేణిగుంట మండలంలో స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తూ రూ.లక్షల్లో అక్రమంగా ఆర్జిస్తున్నారు.

జేసీబీలతో ఇసుక తవ్వకాలు

ప్రభుత్వం యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేస్తుంటే స్థానిక కూటమి నాయకులు మాత్రం విచ్చలవిడిగా యంత్రాలు పెట్టి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. మంగళవారం పిల్లపాళెం సమీపంలో జేసీబీ పెట్టి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేశారు.అలాగే గాజుల మండ్యం వద్ద తిరుపతి-చెన్నై హైవే పక్కనే స్వర్ణముఖి నదిలో జేసీబీతో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగించారు. వీటిపై స్థానికులు సమాచారం ఇచ్చినా అధికారుల్లో మాత్రం స్పందన కరువైంది.


అక్రమ తవ్వకాలకు పహారా కాస్తున్న ముఖ్యనేత అనుచరులు అని చెప్పకుంటున్న వ్యక్తులు

విద్యుత్ ఉపకేంద్రాలకు చొరవ చూపాలి


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం కోసం టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌రావును మంగళవారం తిరుపతి కార్యాలయంలో కలసి విన్నవించారు. ఆ మేరకు స్థానిక ప్రజల విద్యుత్ అవసరాల కోసం సబ్‌స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరమని, అందుకు అనుగుణంగా త్వరితగతిన ఉప కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని విన్నవించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్‌ను కలెక్టరేట్‌లో కలసి పలు సమస్యలు విన్నవించారు. ప్రధానంగా సత్యవేడు మండలం వానెల్లూరు వద్ద మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు తక్కువ ధరకే ఇంటి ప్లాట్లు అందజేసేందుకు ఎంఐజీ లే అవుట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో.. మద్యం తాగితే చర్యలు

రేణిగుంట(ఏర్పేడు) : బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు చేపడుతామని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలో నీలాద్రి అపార్ట్‌మెంట్ వద్ద మందుబాబులు తరచూ మద్యం తాగి బాటిళ్లను అక్కడే విసిరేసి వెళుతున్నారని సమాచారం అందుకున్న సీఐ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో కలసి పరిసరాలను శుభ్రం చేయించారు.

చర్చలు సఫలం


సమ్మెలో పాల్గొన్న కార్మికులు, ఏఐటీయూసీ నేతలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు జరిపిన చర్చలు ఫలించాయి. డీఎల్పీఓ జరిపిన చర్చలపై కార్మికులు సంతృప్తి చెంది సమ్మెను తాత్కాలికంగా విరమించారు. రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమ్మెకు దిగారు. సమాచారాన్ని అందుకున్న శ్రీకాళహస్తి పంచాయతీ డివిజనల్ అధికారి ప్రభురెడ్డి, ఈఓపీఆర్డీ ప్రభురావు కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపారు. పెంచిన జీతాలను ఏప్రిల్ నుంచి అమలు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సంతృప్తి వ్యక్తం చేసి సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు తెలిపారు.

స్త్రీలపై పూజ్యభావం ఉండాలి


స్త్రీల పూజలో ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి, కిరీటధారణలో పీఠాధిపతి, కోలాట నృత్యాలు

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు వ్యాసాశ్రమంలో జరుగుతున్న 88వ అఖండ గురుపూజోత్సవాల్లో భాగంగా మంగళవారం స్త్రీల పూజ వేడుకగా జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని అధిష్ఠాన మందిరంలో విశేష పూజలు చేశారు. కుటీరం నుంచి మహిళలు, వ్యాసాశ్రమ విద్యార్థినులు పీఠాధిపతిని మేళతాళాలు, కోలాట నృత్యాల మధ్య అధిష్ఠాన మందిరానికి తీసుకొచ్చారు. అక్కడ ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళస్వామి శ్వేత శిలా విగ్రహానికి స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, సాధువులు వేదమంత్రాలతో పూజలు చేసి పీఠాధిపతి నుంచి ఆశీర్వచనాలను అందుకున్నారు. పీఠాధిపతి మాట్లాడుతూ.. హైందవ సనాతన ధర్మం ప్రకారం పురాణ, ఇతిహాస గ్రంథాలలో సైతం స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి మనిషి తనలోని స్వార్థ చింతనను విడనాడి, సకల జీవకోటిపై ప్రేమ, కరుణ , గురువులపై విధేయత ఉండాలన్నారు. బుధవారం పురుషుల పూజతో గురుపూజోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో శివరాం స్వామి, విమలానంద స్వామి పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు, దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కుక్కంబాకంలోని దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు దాసరిజనార్దన్ మాట్లాడుతూ.. మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 81లోని 80 ఎకరాల 80 సెంట్లు ప్రభుత్వ భూమిని 20 ఏళ్ల దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు ఇవ్వకపోతే కలెక్టరు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మణి, నలుగూరి రమణయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి బ్లీచింగ్ వితరణ

శ్రీకాళహస్తి : పట్టణంలోని కాసాగార్డెన్‌లోని బాలికల గురుకులానికి శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి చుక్కల పవన్ కుమార్ బ్లీచింగ్ పౌడర్‌ను ప్రిన్సిపల్ మాధవీలతకు అందజేశారు.

బలవంత భూసేకరణ అన్యాయం


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సత్యవేడు : ప్రభుత్వం సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం ,గొల్లపాళెం గ్రామాల్లో 2013 భూసేకరణ చట్టం మేరకు భూసేకరణ చేసి రైతులు , వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భూసేకరణ గ్రామాల్లో పర్యటించారు. మూడు గ్రామాల పరిధిలో 144 ఎకరాల భూములు సేకరిస్తున్న నేపథ్యంలో రైతు సంఘాల నాయకులతో ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం గ్రామాల్లో రైతులతో వారు చర్చించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. భూసేకరణ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం గ్రామసభలు పెట్టలేదన్నారు. పరిహారం వివరాలు ప్రకటించలేదన్నారు. రైతు సంఘాల నాయకులను కొందరు అడ్డుకోవడంపై మండిపడ్డారు. కొందరు పెత్తందారులు రౌడీలను ప్రోత్సహిస్తూ ఎవరూ ప్రశ్నించకుండా అణగదొక్కుతున్నారన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దాసరి జనార్దన్, తిరుపతి జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు ఎం.రమేష్, సత్యవేడు మండల రైతు సంఘం నాయకులు మునస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

దౌర్జన్యంగా చేతిబోరు తొలగింపు


ఇసుకతాగేలిలో తొలగించిన పంచాయతీ చేతిపంపు ఇలా..

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం ఇసుకతాగేలిలో ఓ టీడీపీ నాయకుని ఇంటికి అడ్డంగా ఉందని మంగళవారం పంచాయతీ చేతిబోరును తొలగించారు. ఇసుకతాగేలిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు 2004లో ప్రభుత్వ నిధులతో చేతిబోరును వేశారు. అప్పటి నుంచి చుట్టుపక్కల సుమారు 50 కుటుంబాలు బోరు నీటిని వినియోగించుకుంటున్నారు. అయితే ఓ టీడీపీ నాయకుని ఇంటి గేటుకు అడ్డంగా ఉందన్న నెపంతో ప్రభుత్వ బోరును తొలగించారు. దీనికి పంచాయతీ అనుమతి లేదని, ప్రభుత్వ ఆస్తులను ఎలా ధ్వంసం చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీఓ సౌభాగ్యంకు స్థానికులు ఘటనపై ఫిర్యాదు చేశారు.


రేణిగుంట తిరుపతి రహదారిపై ఆవుల సమూహం

గోమాత ఘోష

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంటలో గోమాత ఘోషిస్తోంది. యజమానులు పాలు మాత్రం పిండుకుని పట్టించుకోకపోవడంతో నడిరోడ్డుపై అలమటిస్తోంది. కనిపించిన వ్యర్థాలను భుజిస్తూ క్షుద్బాధను తీర్చుకుంటోంది. వివరాలు.. పట్టణంలో సుమారు వందకు పైగా పశువులు రోడ్ల పైనే ఉంటున్నాయి. వాహనాలకు అడ్డుపడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. చివరకు రైల్వేట్రాక్‌పై సైతం తిరుగుతూ చూపరులను భయపెడుతున్నాయి. ఈ క్రమంలోనే రేణిగుంటలో పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులకు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. ఏమాత్రం ఏమారుపాటుగా వచ్చినా నిలువునా రోడ్లపై కూలదోస్తున్నాయి. తీవ్రమైన గాయాలతో ఆస్పత్రి పాలయ్యే దుస్థితిని తీసుకువస్తున్నాయి. ఈ మేరకు పంచాయతీ అధికారులు, పోలీసుల అలసత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రింబవళ్లు రోడ్లపై సంచరిస్తున్న పశువులను కట్టడి చేయడంలో వైఫల్యం చెందుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు. పంచాయతీ సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గోవులను వాటి యజమానులు పట్టించుకోకుంటే టీటీడీ నిర్వహిస్తున్న గోశాలకు అయినా తరలించాలని సూచిస్తున్నారు. పశువుల కారణంగా తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్పష్టం చేస్తున్నారు. ఆవులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేస్తున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రేణిగుంట రైల్వే ట్రాక్‌పై సంచరిస్తున్న ఆవులు

వైభవంగా తైపూస వేడుకలు


పాల బిందెలతో భక్తుల ఊరేగింపు

సత్యవేడు : తైపూసం సందర్భంగా మంగళవారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తమిళ నెల తై మాసంలో పౌర్ణమి రోజున తైపూసం జరుపుకోవడం ఇక్కడి సంప్రదాయం. దుష్ట రాక్షసుడైన శూరపద్మను ఓడించడానికి పార్వతి దేవి మురుగన్‌కు వేల్ (పవిత్రమైన ఈటె) ఇచ్చిన సందర్భంగా ఈ పండుగను జరుపుకుంటారు. ఆంధ్ర- తమిళనాడు సరిహద్దులోని సత్యవేడులో తెలుగు, తమిళ సంప్రదాయాలు మిళితమయ్యాయి. తైపూసం రోజున స్వామి వారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. శ్రీ వల్లి, దేవయాని సమేత సుబ్రహ్మణ్యస్వామిని మయూర వాహనంపై ఊరేగించారు. ఊరేగింపులో సంగీతం, కీర్తనలు, నృత్యాలు , ముగ్గురు మహిళలు అమ్మవార్ల రూపాల్లో అలంకరణ పలువురిని ఆకట్టుకొంది.

135 పాలబిందెల ఊరేగింపు

సుబ్రహ్మణ్యస్వామి మాల దీక్ష ధరించిన 135 మంది భక్తులు తలపై పాల బిందెలు మోస్తూ స్వామి వారి ఊరేగింపు ముందు నడిచారు. భక్తులు తీసుకొచ్చిన పాలను స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ఉపవాసంతో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.